# ٦ ـ كِتَابُ عِيَادَةِ الْمَرِيْضِ

# 6. రోగుల పరామర్శ ప్రకరణం

**144వ అధ్యాయం**

## ١٤٤ ـ بَابُ عِيَادَةِ الْمَرِيْضِ، وَتَشْيِيعِ الْمَيِّتِ وَالصَّلاَةِ عَلَيْهِ، وَحُضُورِ دَفْنِهِ وَالْمُكْثِ عِنْدَ قَبْرِهِ بَعْدَ دَفْنِهِ

## వ్యాధిగ్రస్తుణ్ణి పరామర్శించటం, శవం వెంట వెళ్ళటం, జనాజా నమాజ్ చేయటం, ఖనన సంస్కారాల్లో పాల్గొనటం, ఖననం పూర్తయిన తర్వాత సమాధి దగ్గర కాసేపు ఉండటం

٨٩٤ ـ عَنِ الْبَرَاءِ بنِ عَازِبٍ رضي الله عنهما قال: أَمَرَنَا رسولُ الله ﷺ بِعِيَادَةِ الْمَرِيضِ، وَاتِّبَاعِ الْجَنَازَةِ، وَتَشْمِيتِ الْعَاطِسِ، وَإِبْرَارِ الْمُقْسِمِ، وَنَصْرِ الْمَظْلُومِ، وَإِجَابَةِ الدَّاعِي، وَإِفْشَاءِ السَّلام. متفقٌ عليه.

894. హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) వ్యాధిగ్రస్తులను పరామర్శించమనీ, శవం వెంట వెళ్ళమనీ, తుమ్మిన వ్యక్తి తుమ్ముకు సమాధానం పలకాలనీ, ప్రమాణం చేసిన వారి ప్రమాణాన్ని నెరవేర్చాలనీ, బాధితునికి సహాయం చేయాలనీ, ఆహ్వానించేవాని ఆహ్వానాన్ని అంగీకరించమనీ, సలాంను సర్వ సామాన్యం చేయమనీ మమ్మల్ని ఆజ్ఞాపించారు. *(బుఖారీ - ముస్లిం)*

٨٩٥ ـ وعن أبي هريرةَ رضي الله عنه أنَّ رسولَ الله ﷺ قال: «حَقُّ الْمُسْلِمِ عَلَى الْمُسْلِمِ خَمْسٌ: رَدُّ السَّلام،

895. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు : ప్రతి ముస్లింపై సాటి ముస్లింకు ఐదు హక్కులున్నాయి: 1. అతని సలాంకు ప్రతి సలాం చేయటం.

وَعِيَادَةُ الْمَرِيضِ، وَاتِّبَاعُ الْجَنَائِزِ، وَإِجَابَةُ الدَّعْوَةِ، وَتَشْمِيتُ الْعَاطِسِ» متفقٌ عليه.

2. అతను వ్యాధిగ్రస్తుడయితే అతన్ని పరామర్శించటం. 3. అతను చనిపోతే అతని శవం వెంట (శ్మశానానికి) వెళ్ళటం. 4. అతని ఆహ్వానాన్ని అంగీకరించటం. 5. అతను తుమ్మి అల్‌హమ్దులిల్లాహ్ అని అంటే దానికి జవాబు పలకటం. *(బుఖారీ - ముస్లిం)*

٨٩٦ ـ وعنه قال: قال رسولُ اللهِ ﷺ: «إِنَّ اللهَ عَزَّ وَجَلَّ يَقُولُ يَوْمَ الْقِيَامَةِ: يَا ابْنَ آدَمَ! مَرِضْتُ فَلَمْ تَعُدْنِي! قَالَ: يَارَبِّ! كَيْفَ أَعُودُكَ وَأَنْتَ رَبُّ الْعَالَمِينَ؟! قال: أَمَا عَلِمْتَ أَنَّ عَبْدِي فُلاناً مَرِضَ فَلَمْ تَعُدْهُ؟ أَمَا عَلِمْتَ أَنَّكَ لَوْ عُدْتَهُ لَوَجَدْتَنِي عِنْدَهُ؟ يَا ابْنَ آدَمَ! اسْتَطْعَمْتُكَ فَلَمْ تُطْعِمْنِي! قال: يَا رَبِّ!

896. హజ్రత్ అబూ హురైరా (రజి) గారే చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : ప్రళయదినాన దేవుడు మానవునితో "ఓ ఆదం పుత్రుడా! నేను వ్యాధికి గురయినప్పుడు నువ్వు నన్ను పరామర్శించలేదు" అని అంటాడు. దానికి మానవుడు ఆశ్చర్యపోతూ, "ప్రభూ! నీవు సర్వలోకాలకూ ప్రభువువి. అలాంటప్పుడు నేను నిన్ను పరామర్శించటమేమిటి?" అని అడుగుతాడు. అప్పుడు దేవుడు అతనితో, "అది కాదు, ఫలానా నా దాసుడు వ్యాధిగ్రస్తుడయ్యాడని తెలిసి కూడా నువ్వతన్ని పరామర్శించటానికి వెళ్ళలేదు. అతణ్ణి పరామర్శిస్తే నువ్వు అక్కడ నన్ను పొంది ఉండేవాడివన్న విషయం నీకు తెలియదా?" అంతేకాదు, "ఆదం పుత్రుడా! నేను అన్నం పెట్టమని అడిగితే నువ్వు నాకు అన్నం పెట్టలేదు" అని అంటాడు. దానికి మానవుడు "ప్రభూ! సకల లోకాలకూ ప్రభువువి నీవు. నీకు నేను అన్నం పెట్టటమేంటి?" అని విన్నవించుకుంటాడు మానవుడు. దానికి దేవుడు, "అది కాదు, ఫలానా నా దాసుడు నిన్ను

كَيفَ أُطْعِمُكَ وَأَنتَ رَبُّ العَالَمِينَ؟! قال: أَمَا عَلِمْتَ أَنَّهُ اسْتَطْعَمَكَ عَبْدِي فُلانٌ فَلَمْ تُطْعِمْهُ، أَمَا عَلِمْتَ أَنَّكَ لَوْ أَطْعَمْتَهُ لَوَجَدْتَ ذٰلكَ عِنْدِي؟ يَاابْنَ آدَمَ! اسْتَسْقَيْتُكَ فَلَمْ تَسْقِنِي! قال: يَا رَبِّ! كَيفَ أَسْقِيكَ وَأَنتَ رَبُّ العَالَمِينَ؟! قال: اسْتَسْقَاكَ عَبْدِي فُلانٌ فَلَمْ تَسْقِهِ! أَمَا عَلِمْتَ أَنَّكَ لَوْ سَقَيْتَهُ لَوَجَدْتَ ذٰلكَ عِنْدِي؟» رواه مسلم.

అన్నం పెట్టమని యాచించాడు. కాని నువ్వతనికి అన్నం పెట్టలేదు. అతనికి అన్నం పెడితే నువ్వు నన్ను పొందేవాడివన్న విషయం నీకు తెలియదా?'' అంటాడు. ''ఆదం పుత్రుడా! నేను నిన్ను మంచినీళ్ళు అడిగాను. కాని నువ్వు నాకు మంచినీళ్ళు కూడా ఇవ్వలేదు'' అంటాడు.

దానికి, ''ప్రభూ! నీవు సకల లోక ప్రభువువి. నీకు నేను మంచినీళ్ళు త్రాపించటమేంటి?'' అని విస్తుపోతాడు మానవుడు. అప్పుడు దేవుడు అతనితో, ''ఫలానా నా దాసుడు నిన్ను మంచినీళ్ళు అడిగితే నువ్వతనికి మంచి నీళ్ళు ఇవ్వలేదు. నువ్వతనికి మంచినీళ్ళు ఇచ్చివుంటే అక్కడ నువ్వు నన్ను పొందేవాడివన్న విషయం తెలియదా నీకు?'' అని అంటాడు. (ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని సత్కార్యాలు-సత్సంబంధాల ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

విశ్వంలోని దేవుని జీవరాశులు (మానవులయినా, పశుపక్ష్యాదులైనా ఏవయినా సరే) ఆపదలో ఉంటే వాటిని ఆదుకోవటం, వాటికి చేతనయినంత సహాయం చేయటం, వాటిపట్ల మంచిగా మెలగటం దైవం దృష్టిలో అత్యంత ప్రీతికరమైన ఆచరణ. అందుకు ఆయన గొప్ప పుణ్యాన్ని ప్రసాదిస్తాడు. మొత్తానికి ఈ హదీసులో అవసరాల్లో ఉన్న వారిని ఆదుకోవటాన్ని ఎంతో ప్రభావవంతమైన పద్ధతిలో, మరెంతో విలక్షణమైన రీతిలో బోధించటం జరిగింది.

٨٩٧ ـ وعن أبي موسى رضي الله عنه قال: قال رسولُ الله ﷺ: «عُودُوا المَرِيضَ، وَأَطْعِمُوا الجَائِعَ، وَفُكُّوا

897. హజ్రత్ అబూ మూసా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రబోధించారు : వ్యాధిగ్రస్తుణ్ణి పరామర్శించండి, ఆకలిగొన్న వానికి

العَانِيَ»رواه البخاري «العَانِي»: الأَسِير.

అన్నం పెట్టండి. ఖైదీలను విడుదల చేయించండి. (బుఖారీ)

(సహీహ్ బుఖారీలోని వ్యాధిగ్రస్తుల ప్రకరణం)

## ముఖ్యాంశాలు

ఇక్కడ ఖైదీలంటే యుద్ధంలో లేక ఇతర కారణాల వల్ల ఖైదీలుగా పట్టుబడిన ముస్లింలని భావం. అలాంటి ఖైదీలను ముస్లిమేతరుల కారాగారాల నుండి రక్షించటం ముస్లిం సమాజ సామూహిక విధిగా పరిగణించబడుతుంది. అదేవిధంగా నిష్కారణంగా జైలుపాలైన ముస్లింలు, రుణభారం క్రింద నలిగిపోతున్నవారు, ఆర్థిక అవసరాల్లో ఉన్న పూచీదారులు కూడా ఈ హదీసు భావపరిధిలోకి వస్తారు. అలాంటి వారిని కష్టాల నుండి గట్టెక్కించటం కూడా ముస్లింలందరి విధి.

٨٩٨ ـ وعن ثَوْبَانَ رضي اللهُ عنه عن النبيِّ ﷺ قال: «إنَّ المُسْلِمَ إذا عَادَ أَخَاهُ المُسْلِمَ لَمْ يَزَلْ في خُرْفَةِ الجَنَّةِ حَتَّى يَرْجِعَ» قِيلَ: يَا رسولَ اللهِ! وَمَا خُرْفَةُ الجَنَّةِ؟ قال: «جَنَاهَا». رواه مسلم.

898. హజ్రత్ సౌబాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు : ఒక ముస్లిం తన సోదర ముస్లింను పరామర్శించటానికి వెళ్ళి తిరిగివచ్చేంతవరకూ స్వర్గంలో ఖుర్ఫా పనిలో ఉండటంతో సమానం.

అది విని సహచరులు, "దైవప్రవక్తా! స్వర్గంలో ఖుర్ఫా పని అంటే ఏమిటి?" అని సందేహపడగా, "స్వర్గవనంలో తాజా పండ్లు ఏరటం" అని చెప్పారాయన (సల్లం).

(సహీహ్ ముస్లింలోని సత్కార్యాలు-సత్సంబంధాల ప్రకరణం)

٨٩٩ ـ وعن عَليٍّ رضي الله عنه قال: سَمِعْتُ رسولَ اللهِ ﷺ يقولُ: «مَا مِنْ مُسْلِمٍ يَعُودُ مُسْلِماً غُدْوَةً إلَّا صَلَّى عَلَيْهِ سَبْعُونَ أَلْفَ مَلَكٍ حَتَّى يُمْسِيَ، وَإِنْ عَادَهُ عَشِيَّةً إلَّا صَلَّى عَلَيْهِ سَبْعُونَ أَلْفَ مَلَكٍ حَتَّى يُصْبِحَ، وَكَانَ لَهُ

899. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అలీ (రజి) తెలియజేశారు: ఒక ముస్లిం తోటి ముస్లింను ఉదయం పూట పరామర్శిస్తే, డెబ్భైవేల దైవదూతలు సాయంత్రం వరకూ అతని శ్రేయస్సు కోసం దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉంటారు. అదే సాయంత్రవేళ పరామర్శిస్తే ఉదయం

خَرِيفٌ فِي الجَنَّةِ». رواه الترمذي وقال: حديث حسن. «الخَرِيفُ»: الثَّمَرُ المَخْرُوفُ، أي: المُجْتَنَى.

వరకు డెబ్భైవేల దైవదూతలు అతని శ్రేయస్సు కోసం ప్రార్థిస్తూ ఉంటారు. ఇంకా అతని కోసం స్వర్గఫలాలు ఏరి ఉంచబడతాయి. *(తిర్మిజీ - హసన్)*

*(సువనె తిర్మిజీలోని జనాయెజ్ అధ్యాయం)*

٩٠٠ - وعن أنسٍ رضي الله عنه قال: كَانَ غُلامٌ يَهُودِيٌّ يَخْدُمُ النَّبيَّ ﷺ فَمَرِضَ، فَأَتَاهُ النَّبيُّ ﷺ يَعُودُهُ، فَقَعَدَ عِنْدَ رَأْسِهِ فقال لَهُ: «أَسْلِمْ» فَنَظَرَ إِلى أَبِيهِ وَهُوَ عِنْدَهُ؟ فقال: أَطِعْ أَبَا القَاسِمِ، فَأَسْلَمَ، فَخَرَجَ النَّبيُّ ﷺ وَهُوَ يقولُ: «الحَمْدُ للهِ الَّذي أَنْقَذَهُ مِنَ النَّارِ» رواه البخاري.

900. హజ్రత్ అనస్ (రజి) కథనం : ఒక యూద బాలుడు దైవప్రవక్త (సల్లం)కు సేవలు చేస్తుండేవాడు. ఒకసారి అతను వ్యాధిగ్రస్తుడయితే, దైవప్రవక్త (సల్లం) అతన్ని పరామర్శించటానికి వెళ్ళారు. అక్కడికి వెళ్ళి అతని తల దగ్గర కూర్చొని, "ఇస్లాం స్వీకరించు బాబూ!" అన్నారు. ఆ బాలుడు ఏం చేయాలో అర్థంకాక తండ్రివైపు చూడసాగాడు. తండ్రి కూడా, "అబుల్ ఖాసిం (దైవప్రవక్త - సల్లం) మాట విను" అంటూ కొడుక్కి హితవు చెప్పాడు. దాంతో ఆ బాలుడు ఇస్లాం స్వీకరించి ముస్లిం అయిపోయాడు. ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) "ఈ బాలుణ్ణి నరకాగ్ని నుండి కాపాడిన దైవానికి కృతజ్ఞతలు" అని అంటూ అక్కణ్ణుంచి బయలుదేరారు. *(బుఖారీ)*

*(సహీహ్ బుఖారీలోని జనాయెజ్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

పై హదీసు ద్వారా బోధపడుతోన్న విషయాలు ఇవి - ఒకటి : ముస్లింలు, ముస్లిమేతరులు అని చూడకుండా రోగులందరినీ పరామర్శించాలి. పైగా ముస్లిమేతరులను మన సద్వ్యవహారానికి ఎక్కువ అర్హులుగా భావించాలి. వారిని ఇస్లాం ధర్మం వైపు ఆహ్వానించాలి. రెండు : సజ్జనుల సాంగత్యంలో ఉంటే సత్యాన్ని గ్రహించే, మంచిపనులు చేసే అవకాశాలు లభిస్తాయి. మూడు : ఇస్లాంను ధిక్కరించేవారు ఇక సత్యాన్ని గ్రహించలేరని నిరాశకు లోనవరాదు. నాలుగు : తల్లి దండ్రులు తాము సన్మార్గం మీద నడవకున్నా కనీసం తమ పిల్లలనయినా సన్మార్గాన్ని అవలంబించమని హితోపదేశం చేయాలి.